ప్రజాశక్తి
గురువారం 26 జూన్ 2025
5
విజయనగరం

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

వచ్చేనెల 5న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత న్యాయవాదులను కోరారు. బుధవారం కోర్టులో బార్ అసోసియేషన్ సభ్యులు, ప్రభుత్వ, ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ను వేదికగా చేసుకుని ఎక్కువ కేసులు రాజీ చేసి కక్షిదారులకు డబ్బు, సమయం వృథా కాకుండా చూడాలని పిలుపునిచ్చారు. న్యాయవాదులంతా జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ పి.దుర్గయ్య ,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కలిశెట్టి రవి రవిబాబు, సీనియర్ న్యాయవాదులు తమన్న శెట్టి, బార్ అసోసియేషన్ సభ్యులంతా పాల్గొన్నారు.

విఆర్‌ఎల ఆందోళన

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్

కలెక్టరేట్ వద్ద ధర్నా, రాస్తారోకో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమ సమస్యలు పరిష్కరించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద విఆర్‌ఎలు బుధవారం ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, విఆర్‌ఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బి.సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కె.గురుమూర్తి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 నెలలు గడిచినా వి ఆర్‌ఎల సమస్య ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు 8ఏళ్లగా ఒక్క రూపాయి కూడా జీతం పెరగలేదన్నారు. రాష్ట్రంలో మంత్రులు, ముఖ్యమంత్రులు మారుతున్నారు. కానీ, విఆర్‌ఎల కష్టాలు, సమస్యలు తీర్చేవారు కనిపించడం లేదన్నారు. ప్రక్కన ఉన్న తెలంగాణ రాష్ట్రంలో విఆర్‌ఎలకు పేస్కేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకుందని, మన రాష్ట్రంలో కూడా విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలని కోరారు. చదువుకున్న విఆర్‌ఎలు ఎప్పటికైనా విఆర్ఒ ప్రమోషన్ వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం మాత్రం ప్రమోషన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. నామినీలుగా పని చేస్తున్న వారిని విఆర్‌ఎలుగా గుర్తించడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా విఆర్‌ఎలకు పేస్కేలు అమలు చేయాలని, అటెండర్, నైట్ వాచ్‌మెన్ ప్రమోషన్ల శాతాన్ని 70శాతానికి పెంచాలని డిమాండ్.చేశారు. అక్రమ డ్యూటీలను రద్దుచేసి, అర్హులైన విఆర్‌ఎలకు అటెండర్, నైట్ వాచ్‌మెన్‌గా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్ అంబేద్కర్‌కు వినతి అందజేశారు. ధర్నాలో నాయకులు రంగనాయకుడు, భద్ర, డెంకాడ మండలం నుంచి జొన్నాడ అప్పారావు, భోగాపురం నుంచి బి.చంద్రరావు, మెరకముడిదాం నుంచి ఎస్ రామప్పడు, ఎల్ .కోట నుండి రాంబాబు, లక్ష్మణ, దాలయ్య విఆర్‌ఎలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు

కలెక్టరేట్ జంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న విఆర్‌ఎలు

సమగ్ర ప్రణాళిక రూపొందించాలి

- విపత్తుల్లో మరణాలు, ఆస్తి నష్టాలూ తగ్గించాలి
- విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ సంయుక్త సలహాదారు ప్రకాష్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో ఎదురయ్యే విపత్తులపై సన్నద్ధత విషయంలో ప్రతి శాఖ సమగ్ర ప్రణాళిక రూపొందించుకొని రాష్ట్ర విపత్తుల శాఖకు పంపాలని విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ సంయుక్త సలహాదారు ఎన్. ప్రకాష్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విపత్తుల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే విపత్తుల నుండి గట్టెక్కడం సాధ్యమన్నారు. ప్రకృతి వైపరీత్యాలపై రియల్ టైం హెచ్చరికల వ్యవస్థలో సచేత్ యాప్ కీలకమని తెలిపారు. ఈ యాప్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగించు కోవాలన్నారు. ఎఐ, డ్రోన్ టెక్నాలజీల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆపదమిత్ర , ఇతర వాలంటీర్ల సేవలను విపత్తుల కాలంలో వినియోగించు కోవాలన్నారు. విపత్తుల సమయాల్లో మరణాలు, ఆస్తి నష్టాలూ తగ్గించాలని, పశువులను రక్షించాలని, పరిశుభ్రమైన తాగు నీటిని, ఆహారాన్ని అందించాలని తెలిపారు. సమావేశంలో విపత్తుల శాఖ కార్యదర్శి అభిషేక్ బిస్వాస్ , సీనియర్ కన్సల్టెంట్ అభినవ్ వాలియ , డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, అదనపు ఎస్‌పి సౌమ్యలత, ఆర్‌డిఒ సవరమ్మ, డిపిఎం రాజేశ్వరి, సిపిఒ బాలాజీ, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జున రావు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి వెంకటేశ్వర రావు, ఉద్యాన శాఖ అధికారి చంద్ర శేఖర్, ఉప రవాణా కమీషనర్ మణి కుమార్, జిల్లా అటవీ అధికారి కొండల రావు, జిల్లా ఫైర్ అధికారి రాం ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత, పశు సంవర్ధక శాఖ జెడి రమణ, డిఎస్‌సి మధుసూదనరావు, విద్యుత్తుశాఖ ఎస్ఇ లక్ష్మణరావు, రెవిన్యూ సంఘం అధ్యక్షులు తాడ్డి గోవింద తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు; మాట్లాడుతున్న విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ సంయుక్త సలహాదారు ప్రకాష్

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ అవార్డు సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

గ్రామీణ స్థాయిలో పరిశుభ్రతకు అందించనున్న స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్- 2025 అవార్డుకు ప్రతి మండలం నుండి రెండు గ్రామ పంచాయతీలు పోటీపడే విధంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌కు గ్రామపంచాయతీలను ఎంపిక ర్యాంకింగ్ ఇచ్చేందుకు కేంద్ర బృందం వస్తున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో వెబెక్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 37పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దామని, ఆ గ్రామాల్లో పారిశుధ్యం, ప్లాస్టిక్ మేనేజ్మెంట్, ఒడిఎఫ్, వేస్ట్ మేనేజ్మెంట్ తదితర అంశాలు సంబంధించిన పనితీరును పరిశీలించి ర్యాంకింగ్ ఇస్తారని తెలిపారు. అవార్డుకు ఎంపికయ్యేందుకు నిర్దేశించిన పారామీటర్లు చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, డిపిఒ మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, డిడబ్ల్యూ ఎస్ సి సిబ్బంది సుధాకర్, శ్రీలక్ష్మి, సంధ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరువాడ వద్ద ఏనుగుల గుంపు హల్‌చల్

ప్రజాశక్తి -వంగర

మండలంలోని పాత మరువాడ సమీపంలోని కొండ ప్రక్కన గజరాజుల గుంపు బుధవారం హల్ చల్ చేశాయి. తెర్లాం మండలం మీదుగా వచ్చిన గజరాజులు మండలంలోని మరువాడ కొండ ప్రాంతానికి ప్రవేశించాయి. 9 ఏనుగులు ప్రధాన రోడ్డు పక్కన ఉన్న కొండ ప్రాంతంలో సంచరించడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. గతంలో వచ్చిన ఈ గజరాజులు గుంపు మండలంలోని శ్రీహరిపురం, నీలయ్యవలస, బాగంపేట సంగాం, శివ్వాం తదితర గ్రామాల్లో సంచరించి చెరకు, వరి , మొక్కజొన్న పంటలను ధ్వంసం చేశాయి. పశువులపై దాడి చేశాయి. తాజాగా ఇప్పుడు మండలంలోకి ప్రవేశించాయి. ఇవి ఎటువైపు ప్రయాణించి ఎటువంటి నష్టం కలిగిస్తాయోనని మండల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు. సమాచారం తెలుసుకున్న తహశీల్దారు హరి రమణారావు రెవెన్యూ సిబ్బందితో గ్రామంలో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఏనుగులను చూసేందుకు అవి సంచరిస్తున్న ప్రాంతానికి పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకోవడంతో వంగర పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని బందోబస్తు నిర్వహించారు.

పాత మరువాడ సమీపంలో సంచరిస్తున్న గజరాజుల గుంపు

రైల్వే సమస్యలపై డిఆర్‌ఎంకు ఎంపి వినతి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గల వివిధ రకాల రైల్వే సమస్యలపై వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహారాకు ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు వినతి అందజేశారు. ఆయను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి రైల్వే సమస్యలపై చర్చించారు. చీపురుపల్లి ఆర్ఒబి వెంటనే పూర్తి చేయాలని, విశాఖపట్నం నుంచి వయా బొబ్బిలి పార్వతీపురం మీదుగా ఒడిశాకు ప్రయాణించే వందే భారత్ రైలును బొబ్బిలి రైల్వే స్టేషన్లో నిలపాలని కోరారు. గజపతినగరం నియోజకవర్గంలో గల బొండపల్లి, గరుడబిల్లి, గజపతినగరం లెవెల్ క్రాసింగ్ క్లోజర్ ప్రస్తుత పరిస్థితి గురించి వివరించారు. విజయనగరం రైల్వే స్టేషన్ లో గత 20ఏళ్ల నుంచి హౌస్ కీపింగ్, క్లీనింగ్, ట్రాక్ మెయింటెనెన్స్ తదితర విభాగంలో పని చేస్తున్న సుమారు 50 మంది కార్మికుల సమస్యలను ప్రస్తావించి, వారి కాంట్రాక్టర్ నుంచి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. పలు రకాల రైల్వే సమస్యలపై ఒకరోజు విజయనగరంలో రైల్వే అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించాలని డిఆర్‌ఎంకు సూచించారు.

సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వచ్చేనెల 9న జరుగనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ పిలుపునిచ్చారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను నేడు మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కుతోందన్నారు. బుధవారం ఎస్ డబ్ల్యుఎస్ వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమ్మె గోడపత్రికను ఆవిష్కరించారు. అసంఘటిత రంగ కార్మికుల కోసం సమగ్ర చట్టం చేయాలని, షాపు ఎంప్లాయిస్‌కు కనీస వేతనాల చట్టం అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని డిమాండ్‌చేస్తూ సమ్మె చేస్తున్నట్లు తెలిపారు.

పోస్టల్ జీవిత బీమా ఏజెంట్ల నియామకాలు

15 నుంచి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం పోస్టల్ డివిజన్ పరిధిలో తపాలా జీవిత భీమా గ్రామీణ తపాలా జీవిత భీమా పాలసీలు సేకరించేందుకు కొత్తగా ఏజెంట్లు నియామకం కోసం వచ్చేనెల 15 నుంచి 31 వరకు ఇంటర్వ్యూ లు నిర్వహించనున్నట్లు విజయనగరం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ కొల్లూరు శ్రీనివాసు ఒక ప్రకటనలో తెలిపారు. కనీస విద్యార్హత పదవ తరగతి ఉత్తీర్ణత కలిగి వుండాలని, అభ్యర్థులు 18 సం నుండి 65 సంవత్సరాల లోపు వున్న నిరుద్యోగులు,స్వయం ఉపాది పొందుతున్నవారు, పూర్వ భీమా ఏజెంట్లు ఏదయినా ఇతర భీమా సంస్థలలో పనిచేసిన వారు, విశ్రాంత ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు,మాజీ సైనికోపాధ్యాయులు, ఆసక్తి కలవారు ఎవరైనా ఏజెంట్లు గా చేరడానికి అర్హులని తెలిపారు.ఆసక్తి కలవారు పూర్తి చేసిన దరఖాస్తు, ఒరిజినల్ సర్టిఫికేట్ లు, బయోడేటాతో జులై 15 నుండి జులై 31 వరకు జరగనున్న ఇంటర్వ్యూ లకు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన వారిని 12 నెలలు కాలపరిమితికి ఏజెంట్లుగా నియమిస్తూ ఐ డి కార్డు, ఏజెంట్ కోడ్ తో లైసెన్సు జారీ చేస్తామని తెలిపారు. నియమితులైన అభ్యర్థులు రూ.5వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు ఎమ్ఎస్ఆర్ మూర్తి, డెవలప్‌మెంట్ ఆఫీసర్, తపాలా జీవిత భీమా, పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం విజయనగరం, ఫోన్ నంబరుకు 7981895459 వారిని సంప్రదించాలని తెలిపారు.

రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ కర్మాగారానికి భూములు ఇచ్చిన రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేదే లేదని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ హెచ్చరించారు. జిందాల్‌లో నష్టపోయిన రైతులు బొడ్డవర నవోదయ స్కూల్ మధ్యలో జాతీయ రహదారిపై టెంట్ వేసుకొని పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. బుధవారం నిరసన శిబిరంలో రైతులకు మద్దతు తెలిపిన జగన్ మాట్లాడుతూ మాట్లాడుతూ జిందాల్ కంపెనీకి భూములిచ్చి 18 సంవత్సరాలు పూర్తయినా నేటికి జిందాల్ పరిశ్రమ రాకపోవడంతో 2013 చట్టం ప్రకారం పరిశ్రమ పెట్టకపోతేనే రైతుల భూమికి రైతులకు ఇవ్వాలని నిబంధన ఉందని తెలిపారు. ఈ నిబంధన ప్రకారం జిందాల కోసం భూములు ఇచ్చిన రైతాంగానికి ఎవరి భూమి వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. రైతులు పరిశ్రమకు వ్యతిరేకం కాదని, ఎంఎస్ఎంఇ పార్కు ప్రభుత్వం పెట్టదలుచుకుంటే మళ్లీ ఆ రైతుల నుంచి భూమి సేకరించి పరిశ్రమలు పెట్టి ఉద్యోగ కల్పన చేయాలని కోరారు. అలాకాకుండా రైతులను భూములు నుంచి వెల్లగొట్టాలంటే అంగీకరించేది లేదన్నారు. జీవో నెంబర్ 14 ప్రకారం తాటిపూడి నీరు రైతులకు కాకుండా పరిశ్రమలకు ఇస్తే రైతులు సర్వనాశనం అయ్యే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వం అధికారులు కలుగజేసుకొని జిందాల్ కోసం సహకరించిన భూములను రైతాంగానికి అప్పగించి ఆ తర్వాతే పరిశ్రమలకు భూమి సేకరించాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

బొడ్డవర వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

అంధుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రభుత్వ అంధుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అంధ బాల బాలికల విద్య కోసం ప్రత్యేకంగా విజయనగరం ఫూల్‌బాగ్‌లో ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలను 2001 నుంచి నిర్వహిస్తున్నారని తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి నూతన ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు మొత్తం 39 ఖాళీలు ఉన్నాయన్నారు. 6 ఏళ్ల నుంచి 14 ఏళ్ల వయసు కలిగి కనీసం 40శాతం అంధత్వం గల బాల బాలికలు అర్హులని తెలిపారు. ప్రవేశ సమయంలో సదరం వైద్యధ్రువీకరణ సమర్పించాలన్నారు. ఉచిత వసతి, పౌష్టికాహారము, ఆధునిక బ్రెయిలీ సామాగ్రితో విద్య, కంప్యూటర్ పరిజ్ఞానంలో ప్రత్యేక శిక్షణ ఇస్తారనితెలిపారు. ఇతర వివరాలకు 8317548039 , 7989592141, 9676702530, 9100587844, 8985905619 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

కలెక్టర్ అంబేద్కర్‌ను సత్కరిస్తున్న పలుశాఖల అధికారులు, సిబ్బంది

చిత్తశుద్ధితో పని చేయండి : కలెక్టర్

ఏడాదైన సందర్భంగా కలెక్టర్‌కు అధికారుల అభినందనలు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

అధికారులంతా చిత్త శుద్ధి తో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులకు సూచించారు. జూన్ 25తో జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు తీసుకొని ఏడాది పూర్తయిన సందర్భంగా సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా అధికారులు, రెవిన్యూ సంఘం సభ్యులు, పలువురు పాత్రికేయులు కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. డిఆర్ఒ అధ్వర్యంలో జిల్లా రెవిన్యూ అసోసియేషన్ , జిల్లా అధికారులు కలెక్టర్‌ను కలిసి కేక్ కట్ చేసి దుశ్శాలువలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు ఏడాదిలో కలెక్టర్ తో వారి అనుభవాలను పంచుకున్నారు. అధికారుల తో స్నేహపూర్వకంగా వ్యవహరించేవారని, ఏ ఆదేశాలైనా స్పష్టంగా ఇచ్చారని, ఫోన్ చేసి సమస్య చెప్పినా వెంటనే స్పందించే వారని, ఎటువంటి సమస్య ఎదురైనా కలెక్టర్ ధైర్యం చెప్తూ సరైన పరిష్కారాన్ని చూపించేవారని, అందరికీ మార్గదర్శకులుగా నడిపించి విజయం సాధించారని పలువురు అధికారులు కలెక్టర్ ను కొనియాడారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇచ్చిన పనిని పూర్తి చేయడమే ప్రభుత్వ ఉద్యోగి గా మన కర్తవ్యమని, అందరూ కష్టపడి పనిచేశారని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి సౌమ్యలత , ఆర్‌డిఒ సవరమ్మ, డిపిఎం రాజేశ్వరి, సిపిఒ బాలాజీ, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, డిపిఒ మల్లిఖార్జున రావు , ఎస్.సి కార్పొరేషన్ ఇడి వెంకటేశ్వర రావు, ఉద్యాన శాఖ అధికారి చంద్ర శేఖర్, ఉప రవాణా కమిషనర్ మణి కుమార్, జిల్లా అటవీ అధికారి కొండల రావు, జిల్లా ఫైర్ అధికారి రాం ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలో అగ్నిప్రమాదం

విద్యార్థుల బట్టలు, పుస్తకాలు దగ్ధం

విద్యుత్తు షార్ట్ సర్క్యూటే కారణం

ప్రజాశక్తి-కొత్తవలస

విజయనగరం జిల్లా కొత్తవలస మండలం తుమ్మికాపల్లి వద్ద గల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో బుధవారం తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు చెందిన 280 పరుపులు, పుస్తకాలు, బట్టలు, ఇతర సామాగ్రి కాలిపోయాయి. వెంటనే పాఠశాల ఎస్ఒ విజయ కుమారి కొత్తవలస, ఎస్. కోట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది హుటా హుటిన పాఠశాల వద్దకు చేరుకొని మంటలను అదుపు చేశారు. ముందురోజే విద్యార్థుల కోసం పరుపులు రావడంతో పై అంతుస్తులోని స్టోర్ రూమ్‌లో వాటిని ఉంచి, అక్కడ ఉంటున్న విద్యార్థినులను కింద రూముల్లోకి తరలించారు. దీంతో విద్యార్థినులకు ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాఠశాలను పరిశీలించారు. ఇటువంటి సంఘటనలు పునరావత్తం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పిల్లలెవరూ ఆ గదిలో నిద్రించక పోవడంతో ప్రాణాపాయం తప్పిందని అన్నారు. పాఠశాలను పరిశీలించిన వారిలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొరపల్లి రాము, జిఎస్ నాయుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కోళ్ల శ్రీను, క్లస్టర్ ఇంచార్జ్ రత్నాజీ, విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు లెంక శ్రీను, కోరుపోలు అప్పారావు, గొంప దుర్గా ఉమేష్, సాగర్ కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సంపూర్ణంగా సేవలందించాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెరుగైన పుర సేవలు అందించి, సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా కార్యదర్శులు కృషి చేయాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. బుధవారం ఎమినిటీస్ కార్యదర్శులతో నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, ఈ నేపథ్యంలో కార్యదర్శులు మరింత బాధ్యతతో ఉదయం, సాయంత్రం క్షేత్రస్థాయి పర్యటనలు చేసి వీధి దీపాల సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కుళాయిల ద్వారా వచ్చే నీరు వధాగా పోకుండా టేప్ హెడ్సు వేయించుకోమని ప్రజలకు తెలియ చెప్పాలన్నారు. సమావేశంలో ఇఇ ప్రసాద్, డిఇ శ్రీనివాసరావు, ఎఇలు పాల్గొన్నారు.

అనుమతులు లేని నిర్మాణాలు గుర్తించేందుకు క్షేత్ర స్థాయి పర్యటనలు

అనుమతులు లేని నిర్మాణాలు, అక్రమ కట్టడాలను గుర్తించేందుకు నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని ప్రణాళికా కార్యదర్శులను కమిషనర్ నల్లనయ్య ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రమబద్ధీకరణలో ప్రణాళిక కార్యదర్శులదే కీలక భూమికని అన్నారు. ప్రతిరోజు ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటనలు చేపడుతూ అక్రమ నిర్మాణాలు, కట్టడాలను గుర్తించి వెంటనే నిలుపుదల చేయాలని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, టిపిఒ అప్పలరాజు, టిపిఎస్ అనిత పాల్గొన్నారు.

వికలాంగుల చదరంగం పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయస్థాయి వికలాంగుల చదరంగం పోటీలు బుధవారం స్థానిక మెసానిక్ టెంపుల్ హాల్లో ప్రారంభమయ్యాయి. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అతిధి విజయలక్ష్మి గజపతిరాజు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలు విజయనగరంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పోటీలకు వచ్చిన క్రీడాకారులను ఆమె అభినందించారు. వికలాంగులు ఎందులోనూ తీసిపోరు దేనినైనా సాధించగలరనే నమ్మకాన్ని మీరంతా కల్పించారన్నారు. మానసిక ధైర్యం ఉంటే దేనినైనా సాధించగలమన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆడి అంతర్జాతీయ పోటీలకు వెళ్లి పథకాలు తెచ్చి దేశ ప్రతిష్ఠను ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. చదరంగం అసోసియేషన్ కార్యదర్శి జ్వాలాముఖి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 150 మంది వికలాంగ క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారని తెలిపారు. విజేతలుగా నిలిచిన వారు అంతర్జాతీయ పోటీలకు వెళ్లనున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సమయపాలన తప్పనిసరి

వంగర: సచివాలయ ఉద్యోగులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని తహశీల్దార్ హరి రమణరావు, ఎంపిడిఒ రమానాథరావు అన్నారు. వంగర సచివాలయాన్ని తహశీల్దార్ తనిఖీ చేయగా, ఎంపిడిఒ ఎం. సీతారాంపురం సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. అనంతరం ఎంపిడిఒ ఎం. సీతారాంపురం మహిళలు కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న కేంద్రాన్ని పరిశీలించి స్వయం ఉపాధి పొందుటకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

రైతుల నుంచి అధిక వసూలు

బాడంగి: ఎరువుల దుకాణాల యజమానులు రైతుల వద్ద నుంచి ఎరువులు, విత్తనాలకు అధిక వసూలు చేస్తున్నారని సిపిఎం మండల నాయకులు సురేష్ అన్నారు. ఈ మేరకు ఎఒకు బుధవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ ముంచుకొస్తున్న నేపథ్యంలో విత్తనాల కోసం ఎరువుల షాపులకు వెళితే ప్రభుత్వం ధర కంటే అధికంగా వసూలు చేసి రైతులను దోచుకుంటున్నారన్నారు. విత్తనాలతో పాటు అవసరం లేని రసాయనాలను కూడా రైతులకు అంటగడుతున్నారని చెప్పారు. రైతు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని చెప్పున్నా సరే ఇవ్వడం లేదన్నారు. ఇటువంటి షాపుల యాజమాన్యంపైన క్రిమినల్ కేసులు పెట్టి షాపులను వెంటనే సీజ్ చేయాలని ఆయన కోరారు.

చంద్రబాబును కలిసిన డిసిసిబి చైర్మన్

చీపురుపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున బుధవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. రైతులకు అన్ని విధాలుగా మెరుగైన సేవలు అందించాలని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు తనకు పలు సూచనలు చేసినట్టు నాగార్జున తెలిపారు. ప్రధానంగా డిసిసిబి పరిధిలో ఉన్న రైతులకు మెరుగైన సేవలు పారదర్శకంగా అందించాలని సూచించినట్టు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా చంద్రబాబుకి నాగార్జున శుభాకాంక్షలు తెలిపారు.

ఎపి పిజిఇ సెట్‌లో సత్తా చాటిన వంశీకృష్ణ

బొబ్బిలి: ఎపి పిజిఇ సెట్‌లో బొబ్బిలి మెహర్ కాలనీకు చెందిన గొల్లపు వంశీకృష్ణ సత్తా చాటాడు. విశాఖ ఆంధ్రా యూనివర్సిటీలో బిటెక్ పూర్తి చేసిన వంశీకృష్ణ పిజిఇ సెట్‌లో నానో టెక్నాలజీ ఇంజినీరింగ్‌లో రాష్ట్ర స్థాయి 9వ ర్యాంక్ సాధించాడు. వంశీకృష్ణ తండ్రి గొల్లపల్లి విజర్‌ బాగా పని చేయగా తల్లి రమణమ్మ గృహిణి. ఎంటెక్ పూర్తి చేసి ఉన్నత స్థాయిలో స్థిరపడతానని వంశీకృష్ణ చెప్పారు.

పన్ను లేని ఇళ్లకు నోటీసులు

బొబ్బిలి: పన్ను లేని ఇళ్లకు, పన్ను తక్కువ ఉన్న ఇళ్లను గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నట్లు మున్సిపల్ ఆర్ఒ, నాగరాజు చెప్పారు. పట్టణంలోని సాయినగర్ కాలనీలో బుధవారం నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పన్ను లేని ఇళ్లకు, పన్ను తక్కువ ఉన్న ఇళ్లను గుర్తించి పన్ను వేసేందుకు నోటీసులు జారీ చేస్తున్నామని చెప్పారు. అన్ని ఇళ్లకు పన్నులు వేసి మున్సిపల్ ఆదాయాన్ని పెంచుతామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేష్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

104 వైద్య సేవలకు స్పందన

వేపాడ: మండలంలోని సింగరాయి గ్రామ సచివాలయ పరిధిలోని జగ్గయ్యపేట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన 104 సేవలకు 87 మందికి వైద్య సేవలు అందించారు. వీరిలో అధిక శాతం కీళ్ల నొప్పులకు సంబంధించిన వారే ఉన్నారు. వీరందరికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వేణు, సిహెచ్‌ఒ అనసూయమ్మ, సింగరాయి గ్రామ వెల్నెస్ సెంటర్ డిఒ మోహన్, ఎఎన్ఎం వెంకటలక్ష్మి, 104 వాహనం డ్రైవర్ సతీష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జనసేనలో 30 కుటుంబాలు చేరిక

డెంకాడ (భోగాపురం): మండలంలోని ముంజేరు జనసేన పార్టీ కార్యాలయంలో సింగవరం పంచాయతీ పరిధిలోని మహంతిపేట, లెంకపేట, సింగవరం గ్రామాల నుండి వైసిపికి చెందిన 30 కుటుంబాలు జనసేనలో చేరాయి. ఎమ్మెల్యే లోకం నాగమాధవి సమక్షంలో సింగవరం జనసేన నాయకుడు దాడిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ కండవాలను వేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే పార్టీ జనసేన అని ప్రజల సేవకే తమ ప్రతి అడుగు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగవరం జనసేన నాయకులు బోని నర్సింగ్, గురునాధరావు, బొల్లు లలితమ్మ, అంజిబాబు,శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విలేజ్ సర్వేయర్‌పై ఫిర్యాదు

చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో పనిచేస్తున్న విలేజ్ సర్వేయర్ కాళీశంకర్‌పై చీపురుపల్లి కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు స్థానిక తహశీల్దార్‌కి బుధవారం ఫిర్యాదు చేశారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీలో విలేజ్ సర్వేయర్‌గా పనిచేస్తున్న కాళిశంకర్ ఇక్కడున్న రైతులకు సంబంధించి ఎటువంటి పనులూ చేయకుండా వచ్చిన ఫైళ్లను తన వద్ద ఉంచుకుంటూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని తహశీల్దార్ ధర్మరాజుకు ఫిర్యాదు చేశారు. కాళీ శంకర్ అశ్రద్ధ కారణంగా చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఖరీఫ్ సీజన్ దగ్గర పడటంతో రైతుల తాలూకా సమస్యలు ఎక్కడికక్కడే ఉండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని వివరించారు. తక్షణమే ఖాళీ శంకర్ పై చర్యలు తీసుకొని చీపురుపల్లి నుండి బదిలీ చేయాలని కోరారు.

మత్తు పదార్థాలపై అవగాహన అవసరం

శృంగవరపుకోట: మత్తు పదార్థాలు మాదకద్రవ్యాల నిర్మూలనకు అవగాహన అవసరమని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ సిహెచ్ రాజేష్ అన్నారు. జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు వద్దు ఆరోగ్యమే ముద్దు అనే అంశంపై మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు యువత బానిస అవ్వడం వల్ల వచ్చే నష్టాలు గురించి దానివల్ల సమాజానికి, దేశానికి జరిగే నష్టం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్.ఐ ఎస్‌జిఎల్ దస్తగిరి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు

లక్కవరపుకోట: చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై ఇతర పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం ప్రధానోపాధ్యాయులు సగుబండి శివరామకృష్ణ, ఎస్ఎంసి స్కూల్ కమిటీ చైర్మన్ బండారు సన్యాసిరావు, ఉపాధ్యాయ సిబ్బంది ఆధ్వర్యంలో పదిమంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించి పాఠ్యాంశాలు బోధించి మంచి ఫలితాలు సాధించే విధంగా కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ బండారు సన్యాసిరావు, ఉపాధ్యాయులు బి. గోవిందరాజులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇనుప చక్రాల ట్రాక్టర్లు రోడ్డుపై నడపొద్దు

సంతకవిటి: వరినాట్లు వేసే సమయంలో ట్రాక్టర్లకు ఇనుప చక్రాలు బిగించి, రోడ్లు పై నడిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాక్టర్ డ్రైవర్లు లకు సంతకవిటి ఎస్ఐ ఆర్.గోపాలరావు బుధవారం హెచ్చిరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ట్రాక్టర్ ఇనుప చక్రాలు వల్ల రోడ్లు పాడవుతాయని, అనంతరం గుంతలుగా ఏర్పడి, రోడ్డు ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఇలాంటి ఇనుప చక్రాల ట్రాక్టర్లు పొలాల్లో మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఎవరైనా తారు రోడ్లపై ఇనుప చక్రాలతో వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు.

కూలిన వైన్ షాపు స్లాబ్

బొబ్బిలి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మేదరబంద జంక్షన్లో ఉన్న వైన్ షాపు ముందు భాగం స్లాబ్ కూలింది. స్లాబ్ కూలిన సమయంలో ఎవరు లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. వైన్ షాపును ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు పరిశీలించారు. ఎమ్మెల్యే బేబినాయన ఆదేశాలు మేరకు వైన్ షాపును రెండు రోజులలో వేరే షాపునకు తరలిస్తామని చెప్పారు.

నేడు రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

విజయనగరం టౌన్ : ఈనెల 29న విజయవాడలో జరుగు రాష్ట్రస్థాయి అండర్-10, 9వ మినీ (అండర్-12) బాయ్స్ అండ్ గర్ల్స్ ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక గురువారం జరుగుతుందనిఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి డి వి చారి ఒక ప్రకటనలోతెలిపారు. 26న ఉదయం 9గంటలకు విజ్జీస్టేడియంలో జరిగే ఎంపికకు క్రీడాకారులు ఫెన్సింగ్ అసోసియేషన్ వారి గుర్తింపు కార్డు తో హాజరుకావాలని తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని డిఎల్‌పిఒ శిరీషా అన్నారు. బుధవారం ఆమె కొండగుంపాం గ్రామాన్ని సందర్శించి ఇంటింటి చెత్త సేకరణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం మొదలయింది కాబట్టి వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ఆయా గ్రామాల్లో మురుగు, వ్యర్థాలు తొలగించే కార్యక్రమం చేపట్టాలన్నారు. తాగు నీటి పథకాల ట్యాంకులు క్లోరినేషన్ జరిపించి శుద్ధి జలాన్ని అందించాలని సూచించారు. కాగా ఇంటింటి చెత్త సేకరణ, పారిశుధ్యం పై గ్రామస్థులకు మరింత అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్‌సి బి.సుదర్శన్ పట్నాయక్, సర్పంచ్ పి.అప్పన్న, ఇఒపిఆర్‌డి శంకర్ జగన్నాథం, డిపిఆర్‌సి కోఆర్డినేటర్ రహీం, పంచాయతీ కార్యదర్శి తవుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ టి. సుప్రజ పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని 18 గ్రామ సచివాలయాలలో ఇఒపిఆర్‌డి రవికుమార్ పర్యవేక్షణలో బుధవారం ఉదయం 6 గంటల నుండి గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను కలెక్షన్ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్‌లు మీ ఇంటి వద్దకు వచ్చే సమయానికి మీరు పోగు చేసి ఉంచిన చెత్తబుట్టతో ఉన్న చెత్తను బండిలో వేయాలన్నారు. అందరూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో కలగాలని సూచించారు.

నెల్లిమర్ల: సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న డిఎల్‌పిఒ

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చీపురుపల్లి: వర్షాకాలం కారణంగా చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న 21 వార్డులలో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చీపురుపల్లి మేజర్ పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఉన్న వార్డులన్నిటిలోనూ గత రెండు రోజులు నుండి పారిశుధ్య పనులను వేగవంతం చేశారు. వార్డుల వారీగా ప్రతిరోజు తెల్లవారు జాము నుండే పంచాయతీ కేవెంజర్స్ సూపర్వైజర్స్ అందరూ కలిసి పారిశుధ్యంపై దృష్టి సారించి పరిసరాలను శుభ్రపరుస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజలు కూడా పూర్తిస్థాయిలో వర్షాకాలం కారణంగా ఎక్కడికక్కడ చెత్తాచెదారం వేయకుండా పంచాయతీకి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా చీపురుపల్లిలో పారిశుధ్య పనులను పంచాయతీ సిబ్బంది రాము తదితరులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థికి సత్కారం

ప్రజాశక్తి- శృంగవరపు కోట

మండలంలోని కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 588 మార్కులు సాధించిన తెరపల్లి రోషిణిని ఎస్‌కోటకు చెందిన 'స్నేహ' స్వచ్ఛంద సంస్థ బుధవారం ఘనంగా సత్కరించి నగదు బహుమతిని అందజేసినట్లు కొట్టాం హైస్కూల్ హెచ్ఎం పివి రామ్‌కుమార్ తెలిపారు. పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్నేహ స్వచ్ఛంద సంస్థకు చెందిన మంధా సుబ్బారావు, వేమలి రమేష్, ఏఎస్ వెంకటరావు రోషిణిని ఘనంగా సత్కరించి నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహీం షేక్ లాల్, డివి సూర్యనారాయణ, శ్రీను, బంగారునాయుడు, విశ్వనాథం, గోపి, భాస్కర్, సింహాచలం నాయుడు, తీడ శ్రీను, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి పలువురు ఎంపిక

ప్రజాశక్తి- డెంకాడ (భోగాపురం)

భోగాపురం మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు 9 మంది ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించారు. చంద్రకిరణ్ నూజివీడు, మధుప్రియ ఒంగోలు, తరుణ్ అరకు వ్యాలీ, రోహిత్ మౌనిక, జ్ఞానసాయి, మేఘన, నిఖిల్ శ్రీకాకుళంలలో సీట్లు సాధించారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఒకేసారి 9 మందికి ట్రిపుల్ ఐటీలో సీట్లు రావడం ఎంతో గర్వంగా ఉందని పాఠశాలకు దీంతో మంచి గుర్తింపు వచ్చిందని ప్రిన్సిపాల్ స్వాతి స్కూలు ఉపాధ్యాయులు తెలిపారు.

డెంకాడ మండలంలోని అక్కివరం ఎపి మోడల్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించారు. పతివాడ మహాలక్ష్మి, కె.రాఘవేంద్ర, ఆర్.లాస్యశ్రీ, టి.అంజలి సీటు సాధించిన వారిలో ఉన్నారు. వీరిని పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్య ఉపాధ్యా యులు అభినందించారు.

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినిలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు హెచ్ఎమ్ పివి రామ్‌కుమార్ బుధవారం తెలిపారు. గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో మండల ంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అత్య ధిక మార్కులు సాధించి, కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ ఫస్ట్ సాధించిన తెరపల్లి రోషిణి నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికవ్వగా, పల్లవి శ్రీకాకుళం ఎంపికైనట్లు తెలిపారు.

రైతులు ఆధునిక పద్ధతుల పాటించాలి

ప్రజాశక్తి- డెంకాడ

వ్యవసాయం చేసే రైతులు ఆధునిక పద్ధతులను పాటించాలని ఎఒ బి.సంగీత కోరారు. మండలంలోని బంటుపల్లి, రఘుమండ గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. పంట ఉత్పాదకతను పెంచే టెక్నికల్ గురించి తెలుసుకోవాలన్నారు. ఒక బస్తా వరి విత్తనానికి పావు కేజీ సుడోమేషన్ ఫ్లోరిషన్స్ అనే సీలేంద్ర నాశిని పౌడర్‌తో విత్తనాన్ని శుభ్రం చేయడం వల్ల పంటను ఆశించే అగ్గి తెగులు పొడ తెగులు నివారించవచ్చునన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో విత్తనాల మొలక శాతం కట్టగా 90శాతం పైబడి వచ్చిందని తెలిపారు. అనంతరం పినతాడివాడలో రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ ప్రశాంతి, విఎఒ అభిలాష్ రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పెరుమాలిలో పొలంపిలుస్తోంది

తెర్లాం: మండలంలోని పెరుమాలి గ్రామంలో బుధవారం ఎఒ బి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. మొక్కజొన్న పంటలో యాజమాన్యం తీసుకోవలసిన పద్ధతులను వివరించారు. ప్రస్తుతం మొక్క దశలోనే చీడ పీడల నివారణకు మందులను పిచికారి చేయాలని సూచించారు. యాంత్రిక పరికరాలలో సబ్సిడీ గురించి వివరించారు. పెరుమాలి విఎఎ మధు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

బొండపల్లి: వరి సాగులో పాటించవలసిన యాజమాన్య పద్ధతులపై మండల వ్యవసాయ అధికారి మల్లికార్జునరావు రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని కనిమెరక, గెద్దపేట గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మల్లికార్జునరావు మాట్లాడుతూ వరినాట్లు వేసినప్పటి నుండి కోత సమయం వరకు అన్నదాతలు వ్యవసాయ అధికారి సూచనలు పాటించాలని కోరారు. ఎరువులుపై ఆధారపడకుండా సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ సంతోష్, నారాయణరావు పాల్గొన్నారు.

సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- గంట్యాడ

సర్వేయర్ల సమస్యలను పరిష్కారం చేయాలని ఎపి సర్వేయర్ల అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షులు తెల్ల శివ, కార్యదర్శి సింగంపల్లి సురేష్ అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేయర్లు సమస్యలను పరిష్కారం చేయాలని గతంలో ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో నిరసన కార్యక్రమాలు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామన్నారు. జీవో ఒకటి ప్రకారం హేతుబద్ధీకరణలో భాగంగా మిగులు సిబ్బంది అయినా 4722 మంది గ్రామ సర్వేయర్లపై సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. అనంతరం తహశీల్దార్ నీలకంటేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

రాజాం: మున్సిపల్ కార్యాలయం ఎదుట గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది బుధవారం 'ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని' నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల బదిలీలు రేషనలైజేషన్‌కు సంబంధించిన జీవోను పున:పరిశీలించి సొంత మండలంలో పనిచేసుకునే వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. వెబ్ కౌన్సిలింగ్ ద్వారా మాత్రమే బదిలీలు ప్రక్రియ పారదర్శకంగా జరిపి, అంతర్ జిల్లా బదిలీలను కూడా చేపట్టాలని కోరారు. నోషనల్ ఇంక్రిమెంట్లు, స్పష్టమైన జాబ్ చార్ట్ అమలు, సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింపు, అర్హులైన వారి అందరికీ ప్రమోషన్లు వంటి డిమాండ్లను పైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రాజాం మున్సిపాలిటీ మేనేజర్ శ్రీనివాసరావు వినతి పత్రం అందజేశారు. గ్రామ, వార్డు సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాజాం: నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి- రాజాం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో తన ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన రాజాం భాష్యం స్కూల్లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధికల్పనలో భాగంగా ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బి.టెక్, పీజీలలో ఉత్తీర్ణత సాధించిన 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాలో 26కు పైగా బహుళ జాతి కంపెనీలు పాల్గొని అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకుంటాయన్నారు. ఆసక్తి కలిగిని వారు తమ వివరాలను https://naipunyam.apgovt.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, అడ్మిట్ కార్డుతో పాటుగా రెస్యూమ్, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7286042743, 9988853335 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

28న బొబ్బిలిలో జాబ్ మేళా

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 10 కంపెనీలతో కళాశాల ఎంఒయు చేసుకుందని, ఆయా కంపెనీలలో 380 ఖాళీలు భర్తీ కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లమో, ఇంజినీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాలకు 9441254156, 9494594661, 9381217979లను సంప్రదించాలని కోరారు.

రైతుల సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తవలస

రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఖరీఫ్ కాలంలో రైతులకు అవసరమైన విత్తనాలు రాయితీపై పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం దెందేరు గ్రామంలో జరిగిన రైతు సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులందరూ అలసత్వం వహించకుండా రైతులందరికీ సక్రమంగా విత్తనాలు అందేలా చూడాలని కోరారు. రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని కొనుగోలు చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, ఉపాధ్యక్షులు ఎల్లపు సూరిబాబు, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కోళ్ళ శ్రీను, వెలమ సాధికార కమిటీ మెంబర్ లాలం అర్జున్ రావు, విశాఖ పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వక కార్యదర్శి విరోతు శివాజీ, దెందేరు సర్పంచ్ విరోతు రమణ, క్లస్టర్ ఇంచార్జ్ పొట్నూరు వెంకటరత్నాజీ, యూనిట్ ఇంచార్జ్ గొంప దుర్గా ఉమేష్, జామి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మపేటను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎస్‌కోట పంచాయతీలోని శివారు గ్రామమైన సీతంపేట గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని సీతమ్మ పేట గ్రామ ప్రజలు బుధవారం సీతంపేట గ్రామ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు వేమల సన్యాసప్పుడు, చిప్పాడ రమణలు మాట్లాడుతూ ఎస్‌కోట మేజర్ పంచాయతీలో ఉన్న సీతంపేట గ్రామంలో మూడు వార్డులు, ఒక ఎంపిటిసి సెగ్మెంట్ కలిగి 2500 జనాభాతో ఉన్నారన్నారు. తమ గ్రామానికి స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని విజయనగరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు వినతని అందించామని చెప్పారు. తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలని లేకుంటే గ్రామస్తులు అంత ఉద్యమానికి సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీతంపేట గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బంజరు భూమి ఆక్రమణ

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలో గంట్లాం రెవెన్యూ పరిధిలో బంజర భూమిని గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి ఆక్రమించుకున్నాడని యాగాటి పకీరి రాజుతో పాటు మరికొంతమంది ప్రజలు ఆరోపించారు. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి నల్లపరాజు రమణరాజు ఈ ఆక్రమణ చేస్తున్నాడని వారు అన్నారు. గ్రామంలో సర్వేనెంబర్ 121 కొంత బంజరభూమిని ఆక్రమించుకొని జెసిబితో చదును చేశాడని తెలిపారు. దీనిని అమ్ముకొని సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దీని వెనకాల మండల స్థాయి నుంచి నియోజకవర్గం వరకు ప్రజాప్రతినిధులు ఉన్నారన్నారు. ఇదే వ్యక్తి గ్రామంలో సర్వే నెంబర్ 121,6,8 లో గతంలో వైసిపి పార్టీలో ఉండేటప్పుడు బంజరు చెరువు గర్భాన్ని ఆక్రమించుకుని ఇల్లు నిర్మించుకున్నాడని. పేపర్ ప్లేట్లు తయారు చేసుకునే కంపెనీ కూడా నిర్మించుకున్నాడని తెలిపారు. శ్మశాన వాటికకు సంబంధించిన భూమిని కూడా కొంత ఆక్రమించుకొని అమ్ముకొని సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు వైసిపి నుంచి జనసేన పార్టీలోనికి మారి మరీ ప్రభుత్వ భూ అక్రమాలకు పాల్పడుతున్నారని దీనికి ఒక మండల స్థాయి ప్రజాప్రతినిధి, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధుల అండదండలు ఎక్కువగా ఉన్నాయని, వారి ప్రోత్సాహంతోనే ఇదంతా జరుగుతుందని గ్రామస్తులు ఆరోపించారు. ఈ ఆక్రమణలపై తహశీల్దార్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

నట్టల నివారణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని గురువారం నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ ఉచిత మందుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారి ఎం శ్రీకాంత్ తెలిపారు. మేకలు గొర్రెలు పెంపకం దారులు ఈ నట్టల నివారణ ఉచిత మందులు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గంట్యాడ: మండలంలోని ఈనెల 26వ తేదీ నుండి వచ్చేనెల 10వ తేదీ వరకు నిర్వహించనున్న నట్టల నివారణ కార్యక్రమాన్ని వియోగించుకోవాలని పశు వైద్యాధికారి రెడ్డి కృష్ణ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గొర్రెలు మేకలు, పెంపకం దారులు నట్టల నివారణ మందులను వినియోగించుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు పడడం వల్ల కొత్త పచ్చిక పుట్టడం వల్ల నట్టలు వ్యాపించి అవకాశాలు ఉన్నాయన్నారు. దీని వల్ల పొట్ట బులగ వ్యాధి కార్డు చెప్పు వ్యాధి ఇతర వ్యాధులు సంభవించే అవకాశం ఉందన్నారు. నట్టలు నివారణ మందులు పట్టడం వల్ల గొర్రెలు మేకలు ఆరోగ్యం గాను అధిక బరువును కలిగి ఉంటాయని అన్నారు.

పథకాలపై అవగాహన

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని డికె పత్తి పంచాయతీ గిరిజన గ్రామం అయిన బీమవరంలో బుధవారం ధర్తీ ఆభజన్ భగీధర అభియాన్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు అమలు చేసిన పథకాల గురించి ఎంపిడిఒ ఆర్‌వి రమణ మూర్తి అవగాహన కల్పించారు. సర్పంచ్ సన్యాసిరావు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పెద్దలతో పాటు ప్రతి పిల్లవాడు ఆధార్ కార్డులను రేషన్ కార్డులను ఉచిత గ్యాస్ కనెక్షన్ హెల్త్ కార్డులను, కులం, ఆదాయ, జన్మ ధ్రువీకరణ, మరణ ధ్రువీకరణ పత్రాలను చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: గిరిజన గ్రామాల్లో ఉన్న సమస్యలు తెలియజేయాలని ఎంపిడిఒ రవికుమార్ తెలిపారు. బుధవారం సి.హెచ్ బొడ్డవలస సచివాలయ పరిధిలో నిమ్మలపాడు గిరిజన గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దార్తి అభా భాగిదరి కార్యక్రమంలో భాగంగా పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అవసరాలు తెలుసుకొని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వాళ్ళ అవసరాలు తీర్చేందుకు నిధులు మంజూరు చేస్తాయని తెలిపారు. సర్పంచ్ వేలంగిని మాట్లాడుతూ 8 విద్యుత్ స్తంభాలు అడిగామని 5 వేశారని, రోడ్డు ఏర్పాటుకు అటవీశాఖ అభ్యంతరాలు ఉన్నాయని, మూడు ఆశా వర్కర్లు ఖాళీలు ఉన్నాయని అవి భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి భాస్కరావు, వెలుగు ఎపిఎం భాగ్యలక్ష్మి, ఉపాధిహామీ ఎపిఒ లక్ష్మి పతిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య?

ఆలస్యంగా వెలుగులోకి ..ప్రేమ విఫలమే కారణమా?

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలోని కొట్టక్కి వట్టి గెడ్డ బ్రిడ్జి సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఒక యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. సాలూరు మండలం జీగిరాం గ్రామానికి చెందిన నులక ప్రశాంతకుమార్ (26) ఈ నెల 5వ తేదీన ఇంటి నుంచి బ్యాగుతో బయటకు వచ్చాడు. అప్పటి నుంచి కనబడక పోవడంతో అతని తల్లిదండ్రులు సాలూరు పోలీసు స్టేషన్లో ఆచూకి కోసం ఫిర్యాదు చేశారు. ప్రశాంత్‌కుమార్‌కు వివాహం కాగా భార్యతో విడిపోయి ఉంటున్నాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు లారీ క్లీనర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజూ మద్యం సేవించి రావడంతో తల్లి వసంత మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని, ఆ క్రమంలో చెట్టుకు షర్టుతో ఉరివేసుకొని మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. చనిపోయే ముందు పాలకొండలో ఉన్న తన ప్రియురాలితో ఆఖరిగా సంభాషించి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు తెలిపాడని తెలిసింది. ఇతను చనిపోయి సుమారు 20 రోజులు కావడంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయింది. సంఘటనా స్థలం వద్దే బాడంగి వైద్యాధికారి నాగేశ్వరరావు పోస్టుమార్టం నిర్వహించారు. కొట్టక్కి విఆర్వో కిలపర్తి మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. భార్యతోపాటు పిల్లలు కూడా ఆమె వెంటే వెళ్లిపోవడంతో మానసికంగా విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్టు బావిస్తున్నారు. సంఘటనా స్థలం వద్ద తల్లి వసంత, తండ్రి బాలరాజు, బంధువులు బోరున విలపించారు. బొబ్బిలి రూరల్ సర్కిల్ సిఐ నారాయణరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంత్‌కుమార్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

విజయవాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జరజాపుపేటకు చెందిన జ్యూట్ కార్మికుడి కుమారుడు బుధవారం మృతి చెందాడు. జరజాపుపేటకు చెందిన మద్దిల గణేష్ (35) ఉపాధి కోసం వెళ్లి విజయవాడ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గణేష్ విజయవాడలోని ఒక ప్రయివేటు కంపెనీలో సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. విధులు నిర్వర్తించడానికి వెళ్తూ మంగళగిరి వద్ద రోడ్డు దాటుతుండగా తమ కంపెనీ వాహనమే ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

ప్రజాశక్తి- కొత్తవలస

గత నెల 27న అర్ధరాత్రి మండలంలోని మంగళ పాలెంలో గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ దగ్గర రాపర్తి జగదీష్ బాబు ఇంట్లో దొంగతనం జరిగిన సంగతి తెలిసిందే. ఆ కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సిఐ షణ్ముఖరావు బుధవారం తెలిపారు. మహారాష్ట్రకు చెందిన పార్థిగ్యాంగ్ ఈ దొంగతనం చేసినట్లు గుర్తించామన్నారు. ఈ గ్యాంగ్‌లో ఇప్పటికే మిథిన్ ఫిరోజీ పవర్‌ను అరెస్టు చేయగా బుధవారం అజిత్ మట్టు పవర్, అక్షయ్ లక్ష్మణ్ పవర్ అనే మరో ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. వీరిని విచారణ అనంతరం జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించామని మిగతా గ్యాంగ్ సభ్యులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని చెప్పారు.

సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ల దొంగలు అరెస్టు

57 సెల్ ఫోన్లు, 17 లాప్‌టాప్‌లు స్వాధీనం

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం, విశాఖపట్నం జిల్లాలో సెల్ ఫోన్లు, ల్యాప్ టాప్‌లను దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ సి.ఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన బుధవారం వెల్లడించారు. ఈ నెల 6న కాటవీధిలో ఒక లాప్టాప్, రెండు సెల్ ఫోన్లు పోయినట్లు, 9న శివాలయం వీధిలో ఒక ల్యాప్‌టాప్, రెండు సెల్ ఫోన్లు పోయినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశాం. దొంగలను గుర్తించడానికి సీసీ కెమెరాలను పరిశీలిస్తుండగా ఇద్దరు ముద్దాయిలు గుర్తించాం. తమిళనాడుకు చెందిన ముద్దాయిలు మురుగన్ వెంకటస్వామి గణేశన్, మంజపం ఉదయ్ అనే ఇద్దరు వ్యక్తులు వీటి అగ్రహారంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకొని దొంగతనాలు చేస్తున్నారు. వారిని బుధవారం అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద పట్టుకుని రూమ్‌లో పెట్టి విచారించగా విజయనగరం కోట ఏరియాలో ఉంటున్న స్టూడెంట్స్ హాస్టల్ రూమ్ నుంచి, కాటవీధి, శివాలయం వీధిలలో, రఘు కాలేజీ ఏరియాలో, ఎంవీపీ కాలనీ ఏరియాలో, పీఎం పాలెం ఏరియా, ద్వారకా నగర్ విశాఖపట్నంలో ఉంటున్న స్టూడెంట్స్ రూమ్స్‌ను టార్గెట్ చేసుకుని 57 సెల్ ఫోన్లు, 16 ల్యాప్‌టాప్‌లు రెండు ఆపిల్ ఐప్యాడ్‌లను దఫ దఫాలుగా దొంగిలించినట్లు అంగీకరించారు. వాటిని చెన్నై తీసుకువెళ్లి అక్కడ అమ్మి ఆ వచ్చిన డబ్బులను విలాసాలకు వాడుకుంటున్నారు. ముద్దాయిలు వద్ద నుంచి రూ.640 నగదు చెరొక సెల్‌ఫోన్, ఎస్‌బిఐ డెబిట్ కార్డులను సీజ్ చేసినట్లు సిఐ తెలిపారు.

పాఠశాలలను సందర్శించిన ఎంఇఒ

వేపాడ: మండలంలోని బిఎన్‌పేట ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఎస్, వేపాడ కెజిబివి పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి పి. బాలభాస్కరరావు బుధవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, 10వ తరగతి విద్యార్థుల ప్రతిభను పరిశీలించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం స్టాక్ రూమ్, స్టోర్ రూమ్, వంట గది, పరిశీలించి విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాటశాలల ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.